

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వేదికపై శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, సుంకె, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ విజయ, మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు

# దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం

- రాష్ట్రమంతా మళ్లీ కరీంనగర్ వైపు చూసేలా చేపడుదాం
- పార్టీ శ్రేణులంతా తరలిరావాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 26 : రాష్ట్ర మంతా మరోసారి కరీంనగర్ వైపు చూసే విధంగా దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. 2009 నవంబర్ 29న అల్గునూర్ చౌరస్తాలో కేసీఆర్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం రగిలిందని, ఫలితంగా రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని గుర్తు చేశారు. కరీంనగర్ పద్మనాయక కల్యాణ మండపంలో మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల అభివృద్ధిలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి పోయిందని, బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కరీంనగర్‌లో సాగిన ప్రగతి ఇప్పుడు కనిపించడం లేదని మండిపడ్డారు. కొత్త ప్రభుత్వానికి ఏడాది పాటు సమయం ఇచ్చామని, ఇక ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీయాలన్న ఆలోచనతో బీఆర్‌ఎస్ ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా మరో ఉద్యమం కరీంనగర్ నుంచే చేపట్టాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని చెప్పారు. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో డిక్లరేషన్ చేసిందని, దానిపై రానున్న రోజుల్లో నిలదీస్తామని, ఆరు గ్యారంటీలపైనా ప్రశ్నిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించారని, దానిని ఎవరూ చెరిపేయలేరని స్పష్టం చేశారు. అల్గునూర్ చౌరస్తాలో దీక్షా దివస్‌కు అనుమతి ఇచ్చేందుకు పోలీసు యంత్రాగం సిద్ధంగా లేనట్టు తెలుస్తున్నదన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ కార్యక్రమమైన దీనికి ఎలాంటి అడ్డంకులూ సృష్టించకుండా అనుమతులు ఇవ్వాలని కోరారు. పెద్ద ఎత్తున నిర్వహించే దీక్షా దివస్‌కు జిల్లాలోని పార్టీ శ్రేణులంతా భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల విజయ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్లు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### విజయవంతం చేద్దాం

దీక్షా దివస్ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలి. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగడానికి ఆనాడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షే కారణం. అప్పుడు కేసీఆర్‌ను అరెస్టు చేసిన ప్రాంతంలోనే దీక్షా దివస్ చేపట్టాలి. దీనికి మాజీ మంత్రి కేటీఆర్ కూడా హాజరవుతారు.

**- జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు**

### ఉద్యమస్ఫూర్తి నింపేలా దీక్షా దివస్



నవంబర్ 26 సువర్ణాక్షరాలతో లిఖించే రోజు. ఆ రోజు దేశ చరిత్రలో ఎంత ముఖ్యమో.. రాష్ట్ర చరిత్రలో అంతే ముఖ్యం. ఉద్యమ సమయంలో ఆమరణ దీక్షపై నిర్ణయం తీసుకునేందుకు కేసీఆర్ కరీంనగర్‌కు వచ్చిన రోజు అది. ఆ తర్వాత 29న కేసీఆర్ ఆమరణ దీక్షకు కదిలారు. ఆ రోజు ఉద్యమం రాష్ట్రమంతా రగిలింది. ఈ నెల 29న మళ్లీ ఉద్యమ స్ఫూర్తిని నింపేలా దీక్షా దివస్ నిర్వహిద్దాం. ఉద్యమాల పురిటిగడ్డ కరీంనగర్‌పై విజయవంతం చేద్దాం. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 6 వరకు కార్యక్రమాలు సాగుతాయి. ఇక్కడి నుంచే ఉద్యమం ప్రారంభించాలని కేటీఆర్ హాజరవుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన సాగుతున్నది. ఆనాడు ఆంధ్రా వలస పాలన మీద పోరాటం చేశాం. మళ్లీ అదే పరిస్థితి రాబోతున్నది. మరోసారి మలి పోరాటం చేయాల్సిన అవసరం వచ్చింది. **- బండ ప్రకాశ్, శాసనమండలి ఉపాధ్యక్షుడు**

### మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయం

రానున్న రోజుల్లో తెలంగాణలో మరోసారి గులాబీ జెండా ఎగరడం, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. స్వరాష్ట్రం కోసం గతంలో కేసీఆర్ కరీంనగర్ నుంచే ఆమరణ దీక్షకు కార్యచరణ చేపట్టారు. రాష్ట్ర సాధన ఓ చరిత్ర. దీక్షా దివస్‌కు 20 వేలకు పైగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలి. బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.

**- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే**

### శ్రేణులు తరలిరావాలి

కేసీఆర్ ఆమరణ దీక్షకు దిగకపోయి ఉంటే తెలంగాణ వచ్చేది కాదు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధి సాధిస్తే కాంగ్రెస్ ఏడాది పాలనలోనే ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీక్షా దివస్‌తో మరోసారి తెలంగాణ ప్రజల ఆకాంక్షను తెలిపేలా పోరాడుదాం. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి.

**- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

### సత్తా చూపించాలి

మొదటి నుంచి తెలంగాణ జెండాకు కరీంనగర్ గడ్డనే అండగా నిలిచింది. దీక్షా దివస్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రం మొత్తం మరోసారి కరీంనగర్ వైపుగా చూసేలా జిల్లా సత్తా చూపించాలి. **- సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే**

### పోరాట పటిమ చూపాలి

మరోసారి ఉద్యమ పోరాట పటిమను చూపించాల్సిన అవసరం ఉంది. దీక్షా దివస్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజల్లో ఎత్తి చూపించాలి. ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. నాలుగేళ్లు పోరాడాలి. గతేడాదిగా ప్రభుత్వ తీరుతో ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారు. పార్టీ ఎలాంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలి.

**- సునీల్‌రావు, కరీంనగర్ మేయర్**



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, నాయకులు

# చైతన్యం చేద్దాం.. ఎండగడుదాం

- 29న దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం
- నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లిలో సన్నాహక సమావేశం

పెద్దపల్లి, నవంబర్ 26(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని, ఈ తరుణంలో ప్రజలను చైతన్యం చేద్దామని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి ఎండగడుదామని బీఆర్‌ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్దేశం చేశారు. ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆనాడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష యావత్ దేశాన్నే కుదిపేసిందని, ఉద్యమాన్ని మలుపు తిప్పిందని గుర్తు చేశారు. నవంబర్ 29 చరిత్రలో దీక్షా దివస్‌గా నిలిచిందని చెప్పారు. తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో నిలుస్తున్న సమయంలోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిందని, కానీ, పదకొండు నెలలైనా ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు అమలు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వాళ్ల మాటలకు మోసపోతే గోసపడుతామని కేసీఆర్ ఆనాడే చెప్పారని, అదే ఇప్పుడు నిజమవుతున్నదన్నారు. ప్రజల మేలు కోరి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తుంటే, ప్రభుత్వం పగబట్టి జైల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, రఘువీర్ సింగ్, గంట రాములు, మురళీధర్‌రావు, గోపు ఐలయ్య యాదవ్, తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, ఏగోళపు శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, నారాయణ, ఉప్పు రాజ్‌కుమార్, ముబీన్, పూదరి చంద్రశేఖర్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### గద్దె దింపేందుకు దోహదపడాలి

నాడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ ఉద్యమాన్నే మలుపు తిప్పింది. రాష్ట్ర ఆవిర్భావానికి నాంది పలికింది. ఇప్పుడు తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిర్వహిస్తున్న ఈ దీక్షా దివస్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గద్దె దింపేందుకు దోహదపడాలి. ఈ నెల 29న నిర్వహించే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి.

**- కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు**

### హామీల అమలులో సర్కారు విఫలం

కాంగ్రెస్ ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. ప్రజల్లో కూడా ప్రభుత్వంపై పూర్తిగా వ్యతిరేకత మొదలైంది. కాంగ్రెస్‌ను గద్దె దించడమే ధ్యేయంగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది. 29న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలి.

**- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే**

### ఎవరూ భయపడద్దు

అధికారం చూసి ఎగిరెగిరి పడేటోనికి ముందుముందు కేసీఆర్ పవర్ ఏంటో తెలుస్తుంది. కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న కలెక్టర్లు, అధికారులు రాసిపెట్టుకోండి. మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే. వడ్డీతో సహా చెల్లించే బాధ్యత నేనే తీసుకుంట. కచ్చితంగా ఆ పని చేసి చూపిస్త. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎవరూ భయపడవద్దు. ధైర్యంగా ఉండండి. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు మనల్ని ఏం చేయలేరు. సిరిసిల్లలో ప్రజలు ఛీ కొట్టినా అధికారులను అడ్డుపెట్టుకుని ఎగురుతున్న సన్నాసులను గుర్తు పెట్టుకుంట. వారి సంగతి చెబుత

**- కేటీఆర్**

## సంబురాలు కాదు సంవత్సరీకం చేస్తరు

రేవంత్‌రెడ్డి.. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజైనా, వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడు. దేవుళ్లపై ఒట్లు, కేసీఆర్‌కు తిట్లు, హామీలకు తూట్లు పొడిచిండే తప్ప చేసిందేమీ లేదు. ఏడాదిలో ఏమీ సాధించలేదు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. సంబురాలు జరుపుకోవడానికి సన్నద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంవత్సరీకం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎలక్షన్ ఎప్పుడు వస్తుందా..? ఎప్పుడు పాతరపెడదామా..? అని ఎదురు చూస్తున్నారు. రైతులు, నేతన్నలు, ఆటో డ్రైవర్లు, విద్యార్థుల ఆత్మహత్యల సాక్షిగా చెబుతున్నా ఈ ప్రభుత్వ పాలనపై ఏవర్గం కూడా సంతోషంగా లేదు. చేతకాని సీఎంను ప్రజలు ఘోరంగా తిడుతున్నారు. ఏడాదిలో ఒక ముఖ్యమంత్రిని ప్రజలు ఇంతగా తిట్టడం నేనెప్పుడు చూడలేదు. ఆ తిట్లు విన్నాక రోషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడు.

**- కేటీఆర్**



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, వేదికపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు అరుణ, వసంత, మున్సిపల్ చైర్‌పర్సన్లు కళ, మాధవి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, తదితరులు

# భయం వద్దు.. భవిష్యత్ మనదే

- ఏడాదిలో కాంగ్రెస్ చేసిందేమీలేదు
- ప్రజల గుండెల్లో కేసీఆర్
- ఆయన నాటిన మహావృక్షమే బీఆర్‌ఎస్
- కేసీఆర్, పార్టీపై విశ్వాసం పెరుగుతున్నది
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎగిరేది గులాబీ జెండానే
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో శ్రేణులకు దిశానిర్దేశం

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: కేసీఆర్ చేసిన పోరాటాలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు చేసిన త్యాగాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రజల గుండెల్లో ఉన్నారని కొనియాడారు. ఆయన నాటిన మహావృక్షమే బీఆర్‌ఎస్ అని, ఎవరూ భయపడవద్దని, రాబోయే రోజుల్లో మన పార్టీకి, మనకు ఉజ్వల భవిష్యత్తు ఉందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ మోసాలకు ప్రజలు బాధపడుతున్నారని, ఎక్కడ చూసినా, ఎవరిని కదిలించినా కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నరని, మళ్లీ మనమే రావాలని కోరుకుంటున్నరని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై దిశానిర్దేశం చేశారు. దీక్షా దివస్‌కు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ జీవితంలో కష్టాలు రావడం సహజమని, అవి దాటుకుంటూ ముందుకు వెళ్దామని శ్రేణులకు నిర్దేశం చేశారు. తెలంగాణకు బీజేపీ చేస్తున్న అన్యాయాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కొంతమంది బీఆర్‌ఎస్ ఉంటదా.. పోతుందా..? అన్న అవాకులు, చెవాకులు పలికారని, అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తనకు బలమైన విశ్వాసం ఉందని, కేసీఆర్ లాంటి బలమైన నాయకుడు నాటిన మహావృక్షమే బీఆర్‌ఎస్ అని స్పష్టం చేశారు. కేసీఆర్ అనే మొక్కను మొలవనివ్వమని చెబుతున్నవారికి పాలమూరులోని ఊడలమర్రి విశిష్టత ఏమిటో గుర్తు చేశారు. అలాంటి మహావృక్షమే కేసీఆర్ అని, బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఊడలుగా తయారు చేశాడని చెప్పారు. కేసీఆర్‌ను విమర్శించే చిల్లర వెదవల గురించి పట్టించుకునే అవసరం మనకు లేదన్నారు. బీఆర్‌ఎస్‌ను తుడిచేస్తాం, పొడిచేస్తాం అన్నోళ్లు ఒక్కడు కూడా కనిపిస్తలేడని ఎద్దేవా చేశారు. అలాగే ఇప్పుడు అధికారాన్ని చూసి పెట్రేగిపోతున్న వాళ్లకు కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. కేసీఆర్‌తో పెట్టుకున్నోడు ఎవడూ బాగుపడలేదని, భవిష్యత్‌లో మీరే చూస్తారని ధైర్యం చెప్పారు. కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహాన్ని రెట్టింపు చేయాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ భరోసా కల్పించాలని నాయకులకు సూచించారు. తనను ఎలాగైనా పట్టుకొని అరెస్ట్ చేయాలని రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా భయపడేది లేదని, అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ముల అండ ఉన్నంత వరకు ఎవని అయ్యకు భయపడకుండా ప్రజల కోసం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

### రేవంత్‌రెడ్డికి రక్షణ కవచం సంజయ్

మన పోరాటం ఒక కాంగ్రెస్‌తోనే కాదని తెలంగాణను మోసం చేసిన భారతీయ జనతా పార్టీని కూడా ఎండగట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణకు గతంలో నలుగురు ఎంపీలు ఉన్నా, ఈసారి 8మంది ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి నయాపైసా తేలేదని, ఆ విషయాన్ని గ్రామగ్రామానా ప్రచారం చేయాలని సూచించారు. సొల్లు కబుర్లతో ప్రజల్ని మోసం చేస్తున్న నాయకులను సైతం నిలదీయాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ పనిచేస్తున్న విషయాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఆర్‌ఎస్ బ్రదర్స్‌లా వ్యవహరిస్తున్నారని, రేవంత్‌రెడ్డి అభిమాన సంఘానికి బండి రాష్ట్ర అధ్యక్షుడని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరు మీద హైదరాబాద్‌లో చిన్న చిన్న పేదల ఇండ్లు కూల్చితే రేవంత్‌రెడ్డి మంచి పనిచేస్తున్నాడని సంజయ్, రఘునందన్‌రావు మెచ్చుకోవడంపై మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అవినీతి, ఆరు గ్యారెంటీల అమలుపై అడిగేటోళ్లు లేరంటూ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ వ్యవహార తీరుపై ప్రజలకు వివరించి చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. సంజయ్ వేములవాడ పర్యటనను కాంగ్రెసోళ్లు అడ్డుకోబోయారన్నది అవాస్తవని, అభిమాన సంఘం అధ్యక్షుడు వస్తాడన్న ఉత్సాహంతోనే కాంగ్రెస్ కార్యకర్తలు వ్యవహరించారని విమర్శించారు. వీరిద్దరి ఒప్పందంపై గ్రామాల్లో అన్ని చోట్ల చర్చలు జరిగేలా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు.

### ప్రజలు మరిచిపోరు

గుండుకు దెబ్బ తాకితే మోకాలికి మందు పెట్టే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం మన అదృష్టమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'అసెంబ్లీ ఎన్నికలు వస్తే మేం చూసుకుంటాం. చిట్టి నాయుడు సంగతి మేం అర్సుకుంటం. లోకల్ బాడీ ఎన్నికలు వస్తే మీరు చూసుకోండని' కార్యకర్తలకు సూచించారు. చీకటి చూస్తేనే వెలుతురు విలువ తెలుస్తుందని, కరువొస్తేనే వాన విలువ తెలుస్తుందని, గాడిదను చూస్తే గుర్రం విలువ తెలుస్తుందని, తెలంగాణలో కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత బీఆర్‌ఎస్ విలువ ప్రజలకు తెలిసిందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం, చేనేత మరమగ్గాల రంగం, విద్య, వైద్య రంగం ఎలా అభివృద్ధి జరిగిందో ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు.

### సాంచాలు ఇక్కడుంటే నూలు బ్యాంకు మరోచోటనా?

వస్త్ర పరిశ్రమకు కేంద్ర బిందువైన సిరిసిల్లలో సాంచాలు ఉంటే యారన్ బ్యాంకు వేములవాడలో పెట్టిన సన్నాసి ప్రభుత్వం కాంగ్రెస్ అని కేటీఆర్ మండిపడ్డారు. నూలు బ్యాంకును వెంటనే సిరిసిల్లకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. 28సార్లు ఢిల్లీకి పోయిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి రూ.28 కూడా తీసుకురాలేదని, ఇక సిరిసిల్లకు ఒరగబెట్టిందేమిటని నిలదీశారు. విమాన చార్జీలు వృథా అని ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో రైతుల భూములు గుంజుకుంటే నిరసన, ధర్నాలు చేసినా పట్టించుకోని మంత్రులు, అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. అక్కడ సీఎం తమ్ముడు తిరుపతిరెడ్డిదే పెత్తనం నడుస్తుందని ధ్వజమెత్తారు. మా నేరెళ్లలో కూడా ఒక సంఘటన జరిగితే రాజకీయం చేసి లబ్ధిపొందే ప్రయత్నం చేశారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. బాధితులకు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానని, వీలైనంత సాయం చేసినట్లు చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసి ప్రజలు మమ్మల్ని అత్యధిక మెజార్టీతో ఆశీర్వదించారని వివరించారు. అంతకుముందు కేటీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఆయా మండలాల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

## దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

దీక్ష ప్రారంభించిన రోజు దీక్షా దివస్, విజయం సాధించిన రోజు విజయ దివస్‌గా జరుపుకుందాం. ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి. ఆ రోజు తెలంగాణ తల్లి రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు పాలాభిషేకం చేయాలి. కరీంనగర్, సిరిసిల్లలో నాతోపాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ గౌరవ అతిథిగా హాజరవుతారు. ప్రతి మండలం, గ్రామంలో దీక్షా దివస్ కార్యక్రమాలను ఉత్సాహంగా జరపాలి. తెలంగాణ సాధించిన విజయాలను, కేసీఆర్ చేపట్టిన పోరాటాలను నేటి తరానికి వివరించేలా కార్యక్రమాలు నిర్వహించాలి.

**- కేటీఆర్**



సమావేశానికి హాజరైన శ్రేణులు

